క్లుప్తంగా

భగవద్గీత పఠనం అలవర్చుకోవాలి



పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: భగవద్గీత పఠనంతో మానవత విలువలు పెరుగుతాయని, ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవడం అలవర్చుకోవాలని త్రైత సిద్ధాంత హిందూ జ్ఞానవేదిక–ప్రబోధ సేవా సమితి కమిటీ అధ్యక్షుడు మునిదాసు అన్నారు. ఆదివారం మండలంలోని ముసలిమడుగు గ్రామంలో భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిని దర్శిస్తూ భగవద్గీతపై అవగాహన కల్పిస్తూ పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు మంచి మార్గంలో నడవాలంటే భగవద్గీత తప్పకుండా చదవాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు భాస్కర్, స్వర్ణ, భాస్కర్‌గౌడ్, ప్రకాష్, నాగన్న, అనితలు పాల్గొన్నారు.

హిందూ సంప్రదాయాలను పాటించాలి

జూపాడుబంగ్లా: ప్రతి ఒక్కరూ హిందూధర్మ సంప్రదాయాలను అలవర్చుకోవాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు రామచంద్రుడు అన్నారు. ఆదివారం మండలంలోని తాటిపాడు, 80బన్నూరు గ్రామాల్లో ఆధ్యాత్మిక ప్రవచనాలతో కూడిన పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, పుల్లారెడ్డి, శ్రీనివాసులు, కుమార్‌ఆచారి, శేషన్న, నాగమద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాలో ఎంపికైన విద్యార్థులు

నందికొట్కూరు: పట్టణంలోని సాయిరాం కళాశాలలో ఆదివారం జరిగిన జాబ్‌మేళా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. జాబ్‌మేళాకు హిటెరో సంస్థ హెచ్‌ఆర్ సిమోన్ హాజరయ్యారు. 2019–2023 వరకు డిగ్రీ పాసైన విద్యార్థులు 82 మంది జాబ్‌మేళాకు హాజరుకాగా, వారికి ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. 28 మందిని ఇంటర్వ్యూలో ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి



శ్రీను(ఫైల్)

వెలుగోడు: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వెలుగోడు పట్టణానికి చెందిన శ్రీను(40) చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం రాత్రి మృతి చెందాడు. బంధువులు తెలిపిన మేరకు వివరాలు.. సెప్టెంబర్ 19న సాయంత్రం శ్రీను, మహేష్ ఇద్దరూ ద్విచక్ర వాహనంపై డిగ్రీ కాలేజీ వద్దకు వెళ్లి వస్తుండగా ఓ కారు ఢీకొట్టింది. శ్రీను కడుపుపై నుంచి కారు టైర్ వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స నిమిత్తం క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీను మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు సంతానం.


సంక్షేమ పథకాల్లో రజకులకు పెద్ద పీట వేయాలి



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

ఆత్మకూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రజకులకు ప్రజా సంక్షేమ పథకాల్లో పెద్ద పీట వేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, రాష్ట్ర రజకసంఘం నంద్యాల జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్లు , గురుశేఖర్ అన్నారు. పట్టణంలోని సుదర్శన వర్మ భవనంలో ఆదివారం రజక వృత్తిదారుల సంఘం సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ రజకులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, 50 సంవత్సరాలు నిండిన రజకులకు ప్రతి నెల పింఛన్ రూపంలో రూ.5 వేలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం నాయకులు రామకృష్ణ, శ్రీరాములు, పెద్దసుబ్బయ్య, బంగారం, శోభన్‌బాబు, శివన్న పాల్గొన్నారు.

ఆకతాయిల ఆటకట్టించేందుకు సాధారణ భక్తుల్లా..



సాధారణ భక్తుల్లా వెళ్తున్న ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్, కానిస్టేబుళ్లు

మహానంది: ఆదివారం వస్తే చాలు మందుబాబులు హంగామా చేస్తుంటారు. అందులోనూ పవిత్రమైన పుణ్యక్షేత్రమని చూడకుండా పలువురు మహానంది ఆలయానికి మద్యం సేవించి వస్తూ అల్లర్లకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. ఈ మేరకు మహానంది ఎస్‌ఐ జి.నాగేంద్రప్రసాద్, కానిస్టేబుళ్లు సాధారణ భక్తుల్లా మఫ్టీలో వెళ్లి ఆలయ పరిసరాల్లో పర్యవేక్షించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మద్యం సేవించి ఆలయంలోకి ఎవరైనా ప్రవేశిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అప్రమత్తం కాకపోతే ప్రాణాపాయం

- విజృంభిస్తున్న విషజ్వరాలు
- ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రాణాలకే ముప్పు
- సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న వైద్యులు



జూపాడుబంగ్లాలో జ్వరాల బారిన పడిన వారికి ఇంటివద్ద కెళ్లి చికిత్స చేస్తున్న వైద్యులు, వైద్యసిబ్బంది

జూపాడుబంగ్లా: అప్రమత్తంగా లేకపోతే దోమకాటుతో ప్రాణాపాయమేనని జూపాడుబంగ్లా, పారుమంచాల ప్రాథమిక వైద్యులు నాగేంద్ర, మౌనిక అంటున్నారు. ప్రస్తుతం సీజనల్‌గా వ్యాపిస్తున్న విషజ్వరాలు, డయేరియా, మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఈ వ్యాధుల వ్యాప్తికి ముఖ్యకారణం దోమకాటేనంటున్నారు వైద్యులు.

దోమకాటుతో విషజ్వరాలు

దోమకాటేకదా అని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందంటున్నారు వైద్యులు. దోమకాటు వల్ల విషజ్వరాలతో పాటు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటివి వ్యాపిస్తాయి. వీటికి సకాలంలో వైద్యచికిత్సలు చేయించుకోకపోతే ప్రాణాలు కోల్పోవాల్సి ఉంటుంది. గత మూడు నెలల్లో మండలంలోని పలు ప్రాంతాల్లో టైఫాయిడ్, మలేరియాతో పాటు డెంగీ కేసులు నమోదు కావడంతో ఆందోళన కలిగించే విషయం. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ.. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ, దోమల వ్యాప్తిని అరికడితే విషజ్వరాల బారినుంచి రక్షణ పొందవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

టైఫాయిడ్ లక్షణాలు..

ఎంటరిక్ సాల్మినెల్లా అనే దోమకాటు వల్ల టైఫాయిడ్ జ్వరం వస్తుంది. కలుషితమైన తాగునీరు, ఆహారం పదార్థాలు తిని, తాగటం వల్ల టైఫాయిడ్ జ్వరం వస్తుంది. టైఫాయిడ్ జ్వరం వచ్చినప్పుడు జ్వరం, తలనొప్పి, కడుపునొప్పి, విరేచనాలు వంటి లక్షణాలతో పాటు శరీరంపై ఎర్రటి దద్దుర్లు ఏర్పడతాయి. వెంటనే వైద్యుల వద్ద చికిత్సలు చేయించుకోవాలి.

డెంగీ.. ఎల్లోఫీవర్

ఎడీష్ ఈజిప్ట అనే దోమకాటు వల్ల డెంగీ, ఎల్లోఫీవర్ వస్తుంది. ఈరకం జ్వరాలు వచ్చిన వారికి నీరసంగా ఉండి శరీరంపై ఎర్రటి దద్దుర్లు ఏర్పడతాయి. వాంతులు, ఒళ్లునొప్పులు ఉంటాయి. వెంటనే అప్రమత్తమై వైద్యుల వద్ద మెరుగైన చికిత్సలు చేయించుకోవాలి. లేకపోతే ప్రాణాపాయం సంభవిస్తుంది.

మలేరియా..

ప్లాస్మోడియం దోమకాటు వల్ల మలేరియా జ్వరం వస్తుంది. ఈ జ్వరం వచ్చిన వారికి తలనొప్పి, చెమటతో కూడిన జ్వరం, వాంతులు, విరేచనాలు, ఒళ్లునొప్పులు ఉంటాయి. మలేరియా రక్తపరీక్షలు చేయించుకొని వైద్యుల వద్ద తగిన చికిత్సలు చేయించుకోవాలి.

అప్రమత్తతే ఆరోగ్యానికి రక్ష

సీజనల్ వ్యాధుల పట్ల వైద్య, ఆరోగ్యసిబ్బంది నిరంతరం గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు తగిన సలహాలు,సూచనలు ఇస్తూ వారిని నిరంతరం అప్రమత్తం చేస్తున్నారు. రోగాలబారిన పడిన వారికి వెంటనే వైద్యచికిత్సలు అందేలా చేస్తున్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ.. ఇళ్ల పరిసరాల్లో మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవాలని, డ్రమ్ముల్లో నీటిని ఎక్కువకాలం నిల్వ వుంచకూడదని సూచిస్తున్నారు. పాడైపోయిన టైర్లు, తాగిపాడవేసిన కొబ్బరిచిప్పలు, పూల చెట్లు, రుబ్బురోళ్లు, వాటర్‌ట్యాంకులు తదితర ప్రాంతాలను దోమలు ఆవాసంగా ఏర్పాటుచేసుకొని గుడ్లు పొదిగి వాటి సంతతిని పెంచుకుంటాయి కనుక.. వాటిని గుర్తించి వెంటనే దూరంగా పారవేయటం లేదా మూతలువేసి పదిలం చేసుకోవాలని చెబుతున్నారు.

నిరంతరం అవగాహన కల్పిస్తున్న వైద్యులు, వైద్యసిబ్బంది

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్, 104 వైద్యసేవలు తదితరాల వల్ల నిరంతరం ఆశ, ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లోని ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకుంటున్నారు. జ్వరాలు వ్యాపించిన వారి వివరాలు తెలుసుకొని వెంటనే వైద్యులకు సమాచారం ఇవ్వటంతో పాటు వారికి మెరుగైన వైద్యం అందేలా చేస్తున్నారు. సీజనల్‌గా వ్యాపించే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తూ నిరంతరం ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ పథకం ద్వారా వైద్యులు నేరుగా రోగుల ఇంటివద్దకు వెళ్లి వైద్యచికిత్సలు అందిస్తున్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



వర్షాకాలంలో దోమలు అధికంగా వ్యాపిస్తాయి. దోమలు వ్యాపించకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మురుగునీటి నిల్వలేకుండా చూసుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి. కాచివడగట్టిన నీటిని మాత్రమే తాగటంతో పాటు దోమకాటు నుంచి రక్షణగా దోమతెరలను వినియోగించాలి. దోమకాటు గురై జ్వరం బారిన పడిన వారు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యచికిత్సలు చేయించుకోవాలి. బీపీ కేసులు పెరుగుతున్నందున తినే ఆహారంలో ఉప్పు, కారం తగ్గించుకొని తినటం ద్వారా రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చు.

– డాక్టర్ గంగాధర్, ప్రాథమిక వైద్యాధికారి, జూపాడుబంగ్లా

దోమకాటే కదా అని నిర్లక్ష్యం చేయవద్దు



దోమకాటే కదా అని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చికిత్సలు చేయించుకోవాలి. దోమకాటు పాముకాటుకంటే ప్రమాదకరమైనది. దోమకాటు వల్ల జ్వరం రావడం, శరీరంపై దద్దుర్లు ఏర్పడటం, తలనొప్పి, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను ఆశ్రయించి చికిత్సలు చేయించుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం సంభవించే అవకాశాలున్నాయి.

– డాక్టర్ మౌనిక, ప్రాథమిక వైద్యాధికారిణి, పారుమంచాల

ఆగస్టు నుంచి ఇప్పటిదాకా మండల పరిధిలో ఉన్న జూపాడుబంగ్లా, పారుమంచాల, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో నమోదైన వ్యాధుల కేసుల వివరాలు ఇలా...

పీహెచ్‌సీ పేరు	డెంగీ	మలేరియా	టైఫాయిడ్	లెప్రసీ	టీబీ	బీపీ
జూపాడుబంగ్లా	02	01	05	02	10	30
పారుమంచాల	02	02	05	02	12	25

వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠకు ఆహ్వానం



ఎమ్మెల్యే శిల్పాకు ఆహ్వానపత్రం అందజేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

ఆత్మకూరు: పట్టణంలో ఈ నెల 28 న నిర్వహిస్తున్న వాల్మీకి జయంతి కార్యక్రమంలో పాల్గొని వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ చేయాలని ఆత్మకూరు వాల్మీకి సంఘం నాయకులు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి ఆదివారం ఆహ్వానపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆదిత్యకళాశాల కరస్పాండెంట్ భాస్కర్ నాయుడు, దీపాకళాశాల కరెస్పాండెంట్ వెంకటరమణ, వార్డు కౌన్సిలర్లు బోయలక్ష్మమ్మ, బోయ రాముడు, పార్వతి పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వాల్మీకులకు తన వంతు సహకారాన్ని అందజేస్తానని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరి అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అలాగే స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, నంద్యాల అగ్రికల్చర్ టీచింగ్ అసోసియేట్ కార్యదర్శిగా ఎంపికైన సతీష్‌బాబు ఎమ్మెల్యేను సత్కరించారు.

రఫి కుటుంబ సభ్యులకు పరామర్శ

పట్టణంలోని 1 వ వార్డు కౌన్సిలర్ కరిముల్లా మేనల్లుడు రఫి ఇటీవల మృతి చెందడంతో ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ఆదివారం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా నిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు సయ్యద్‌మీర్, జెడ్పీటీసీ శివశంకర్‌రెడ్డి కౌన్సిలర్ విజయచౌదరి, వాల్మీకి సంఘం నాయకులు శివ, జనార్దన్, వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వరరెడ్డి, లక్ష్మీరెడ్డి, సుధాకర్, ఎలిషా, భరత్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వు ఫారెస్టులోకి వెళ్లకూడదు



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

కొత్తపల్లి: గ్రామాలలోని ప్రజలు ఎవ్వరు కూడా ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి నల్లమల రిజర్వు ఫారెస్టులోకి వెళ్లకూడదని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం కొత్తపల్లి మండలంలోని బలపాలతిప్ప, సిద్ధేశ్వరం గ్రామాల ప్రజలతో జనాలగూడెంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎక్కువగా అడవి జంతువులు, వన్యప్రాణులు సంచరిస్తుంటాయన్నారు. జంతువులు, వన్య మృగాలు స్వేచ్ఛగా తిరగాడే ప్రదేశాలకు ప్రజలు వెళ్లకూడదన్నారు. అలా వెళ్లి వాటి స్వేచ్ఛకు ఇబ్బంది కలిగించరాదని చెప్పారు. రిజర్వు ఫారెస్ట్‌లో జీవాలను మేపుకోకూడదని సూచించారు. సమావేశంలో ఎఫ్‌బి ఓ పాములేటి, ఫారెస్ట్ సిబ్బంది, ఆయా గ్రామాల గ్రామస్తులు ఉన్నారు.

రైతులకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి
- కురుకుంద, కొట్టాలచెర్వు ఆర్బీకేల ప్రారంభం



కురుకుంద ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆత్మకూరురూరల్: రైతులకు సమస్యలు వచ్చినప్పుడంతా సకాలానికి స్పందించి, వాటిని పరిష్కరించేందుకు తాను సిద్ధం ఉంటానని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని కురుకుంద, కొట్టాలచెర్వు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పైర్లు ఎండి పోతున్నాయని అబ్దులాపురం రైతులు బాధ పడుతున్నారని తెలిసిన వెంటనే.. రూ.30 లక్షలు సొంత నిధులు వెచ్చించి వెలుగోడు రిజర్వాయర్ నుంచి సాగునీటిని ట్రాక్టర్ల ద్వారా తోడించానని తెలిపారు. అలాగే సిద్ధాపురం చెరువుకు ప్రతి ఏడు లక్షల రూపాయలు సొంత నిధులు ఖర్చు పెడుతున్నానని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందన్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ భరత్ కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ శివశంకర్ రెడ్డి, ఏడీఏ ఆంజనేయ, ఏఓ విష్ణు వర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాలస్వామి, గ్రామ సర్పంచ్ మహబూబ్‌బీ, ఎంపీటీసీలు రాజ్యలక్ష్మి, కలాం, నాయకులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే

ఆత్మకూరు మండలం నల్లకాల్వ గ్రామంలో సీఎండీఎఫ్ నిధులతో నిర్మించిన మినరల్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ప్రారంభించారు. గ్రామస్తులకు స్వచ్ఛ జలాలను అందించాలన్న సదుద్దేశంతో ఎమ్మెల్యే నిధులతో ప్లాంట్ నిర్మించామన్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ వెంకటరమణ, ఎంపీటీసీ శాంతమ్మ, ఆర్‌డబ్ల్యుస్ డీఈ శ్రీనివాసులు, ఏఈలు సువర్చల, పక్కీరయ్య, నాయకులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే ఆత్మగౌరవం

కొత్తపల్లి: సమాజంలో దళిత, గిరిజనులకు ఆత్మగౌరవం దక్కాలంటే కేవలం సామాజిక, ఆర్థిక పోరాటాలతోనే సాధ్యమవుతుందని ఏపీ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి స్వాములు, కాటికాపరి, బేగరీల సంఘం మండల నాయకుడు చిన్న చిన్నయ్య అన్నారు. ఆదివారం మండలంలోని శివపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో కేవీపీఎస్ జెండా ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సమాజంలో దళితులు అణచివేతకు గురికాకుండా ఉండాలంటే ఆర్థికంగా ఎదగాలన్నారు. దీనితో పాటు సామాజిక విషయాల పట్ల అవగాహన ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో బేగరీలు సుందర్రావు, పుల్లన్న, ధర్మరాజు, రాజు, దేవసహాయం, సత్యరాజు పాల్గొన్నారు.

మహానందిలో క్యూలైన్ల ఆధునికీకరణ





మహానందిలో ఏర్పాటు చేసిన ఆకర్షణీయమైన క్యూలైన్లు

మహానంది: మహానందీశ్వరుడి భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లలను ఆధునికీకరిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మహానందీశ్వరుడి దర్శనానికి వచ్చే భక్తులు వెళ్లే క్యూలైన్లు పాతబడిపోవడంతో వాటి స్థానంలో ఆదివారం నూతనంగా స్టెయిన్‌లెస్ స్టీల్ క్యూలైన్ల ఏర్పాటు పనులు ప్రారంభించారు. ఈ మేరకు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దాతల సహకారంతో సుమారు రూ. 7లక్షలు వెచ్చించి ప్రస్తుతం కొన్ని క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. మరికొంత మంది దాతల ఆధ్వర్యంలో ఉచిత, సాధారణ, ప్రత్యేక ఇతర పాత క్యూలైన్లను తొలగించి వాటి స్థానంలో అధునాతనమైన స్టెయిన్‌లెస్ స్టీల్‌తో క్యూలైన్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన



వన్యప్రాణులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

శ్రీశైలంప్రాజెక్ట్: వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల సందర్భంగా ఆదివారం అటవీశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో ప్రతిభా పాఠశాల విద్యార్థులతో కలిసి అటవీ అధికారులు ర్యాలీ నిర్వహించారు. రేంజ్ అధికారి వి.నరసింహులు మాట్లాడుతూ సృష్టికి మూలం పంచభూతాలని పంచభూతాలు కాలానుగుణంగా సక్రమంగా పనిచేయాలంటే ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి ఎస్ బషీర్ అహ్మద్, సెక్షన్ ఆఫీసర్ జె.నాగునాయక్, బీట్ ఆఫీసర్ పి.సలాం అల్లా, ఆర్‌బాలజీ, జె.రవీంద్రనాథ్ ఠాగుర్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం పెరిగితే మానవ మనుగడకు ముప్పు

మహానంది: కాలుష్యం పెరిగితే మానవమనుగడకే ప్రమాదం తప్పదని, ప్రతి ఒక్కరూ చెట్లను పెంచాలని అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హైమావతి తెలిపారు. వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా మహానందిలో ఆదివారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. డీఆర్‌ఓ హైమావతి మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని, మొక్కలు నాటడంతో పాటు వాటిని పరిరక్షించుకుంటూ పెంచాలని అన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓ ప్రతాప్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రాజశేఖర్‌బాబు కోరారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు అందజేయాలని, ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరుకావాలని సూచించారు.

శిల్పం.. చరిత్రకు దర్పణం!



ఆలయ చరిత్రను వివరించే శిల్పం

మహానంది: నల్లమలలో వెలిసిన మహానంది ఆలయం మహానందానికి నిలయం. పుట్టలో నుంచి స్వయంభువుగా వెలిసిన శ్రీ మహానందీశ్వరస్వామి మహిమాన్వితుడిగా పూజలందుకుంటూ భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్నాడు. ఆలయ ప్రాంగణంలో ఆలయ చరిత్రను స్పష్టంగా కళ్లకు కట్టినట్లు చూపించేలా ఏర్పాటు చేసిన శిల్పాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. దీంతో పాటు ఆలయంలోని యాగశాల(హోమశాల) ముందు మారేడు వృక్షం పడిపోగా అచ్చంగా వినాయకుడి ఆకారంలో భక్తులను ఆకర్షిస్తుంది. వృక్షగణపతిగా నిత్యం భక్తులు దర్శించుకుంటుంటారు. దాతల సహకారంతో రంగులు వేయించడంతో భక్తులకు మహానందం కలిగిస్తున్నాయి.



వృక్షగణపతి

ఆలయాల్లో సండే సందడి



మహానందీశ్వరుడి సన్నిధిలో భక్తులు

మహానంది: మహానందీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. కొద్దిరోజులుగా రద్దీ తక్కువగా ఉన్నప్పటికీ వీకెండ్ శనివారం , సెలవురోజు ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు.

ఓంకారంలో ..

ప్రసిద్ధ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవురోజు కావడంతో వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. ఆలయానికి చేరుకున్న భక్తులు శ్రీ గంగ, ఉమాసమేత ఓంకారసిద్ధేశ్వర స్వామిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. అనంతరం భక్తులు స్థానిక కాశినాయన అన్నప్రసాద వితరణ వద్ద అన్నప్రసాదాలు స్వీకరించారు.

శౌర్య జాగరణ యాత్ర



పాములపాడుకు చేరుకున్న శౌర్య జాగరణ యాత్ర



కోలాటం ఆడుతూ హిందూధర్మ పరిరక్షణ శౌర్య యాత్రకు స్వాగతం పలుకుతున్న బాల, బాలికలు

నందికొట్కూరు: విశ్వ హిందూ పరిషత్ భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శౌర్య జాగరణ యాత్ర ఆదివారం పాములపాడుకు చేరింది. యాత్ర ద్వారా సమాజానికి మంచిని బోధించేందుకు పాటుపడటం అభినందనీయమని భక్తులు అన్నారు. భక్తులు యాత్రలో పాల్గొన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రథానికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

హిందూధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సంకల్పించాలి

జూపాడుబంగ్లా: హిందూధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ చెయ్యి చెయ్యికలిపి పట్టుదలతో కృషిచేయాలని విశ్వహిందూ పరిషత్ భజరంగ్‌దళ్ సభ్యులు పిలుపునిచ్చారు. ఆదివారం మండలకేంద్రమైన జూపాడుబంగ్లాలోకి ప్రవేశించిన హిందూ ధర్మ పరిరక్షణ శౌర్యయాత్రకు గ్రామంలోని హిందువులు ఘనంగా స్వాగతం పలికారు. క్వార్టర్స్ నుంచి జూపాడుబంగ్లా శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం వరకు చిన్నారులు కోలాటం ఆడుతూ చూపరులను ఆకట్టుకున్నారు.

జిల్లా స్థాయి ఖోఖో ఎంపిక పోటీలు ప్రారంభం



రిబ్బన్ కట్‌చేసి ఖోఖో పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

పగిడ్యాల: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం కర్నూలు జిల్లా ఖోఖో అసోసియేషన్ చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి ఆధ్వర్యంలో జూనియర్ ఖోఖో ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను జెడ్పీటీసీ పుల్యాల దివ్య రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఖోఖో పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

కర్ణాటక బస్సు-లారీ ఢీ



ఢీ కొట్టుకున్న కర్ణాటక బస్సు-లారీ

నందికొట్కూరు: కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి బస్సు, లారీ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలుకాగా, మరికొందరికి స్వల్పగాయాలయ్యాయి. పాములపాడు ఎస్‌ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు మంత్రాలయం నుంచి చేపల లోడుతో ఏలూరుకు వెళ్తున్న ఏపీ 37 టీబీ 8596 నంబర్ గల లారీ, శ్రీశైలం పుణ్యక్షేత్రం వెళ్లి తిరుగు ప్రయాణమైన కేఏ 57ఎఫ్ 4127 గల కర్ణాటక బస్సు పాములపాడు మండలం జూటూరు వద్ద ఢీకొన్నాయి. ప్రమాదంలో లారీ డ్రైవర్ జబ్బార్‌ఖాన్, ఓ ప్రయాణికుడికి కాళ్లు విరిగి పోవడంతో 108లో కర్నూలు వైద్యశాలకు తరలించారు. బస్సులో మరి కొందరికి స్వల్ప గాయాలుకాగా స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

దేవస్థానం కార్యకలాపాల్లో అన్యమతస్తులను అడ్డుకోండి



ఈఓ పెద్దిరాజుకు వినతిపత్రం సమర్పిస్తున్న కరాటే కల్యాణి, శ్రీనివాసాచారి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలదేవస్థానం పరిధిలో చేపట్టే వివిధ రకాల పనుల్లో అన్యమతస్తులుండకుండా అడ్డుకోవాలని శ్రీఆదిభట్ల శ్రీకళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు, సినీనటి కరాటే కల్యాణి, రాష్ట్రీయ శివాజీ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు తాడోజు శ్రీనివాస ఆచారి కోరారు. ఈ మేరకు ఆదివారం దేవస్థానం కార్యనిర్వాహణాధికారి పెద్దిరాజును కలిసి వినతిపత్రాలు సమర్పించారు. దేవస్థానంలో అన్యమతస్తులు అన్ని టెండర్లలో పాల్గొంటున్నారని, వాటిని కట్టడి చేసి హైందవ ధర్మాన్ని కాపాడాలన్నారు. ప్లాస్టిక్‌బాటిళ్ల స్థానంతో గాజు సీలాలు తీసుకువచ్చే క్రమంలో దేవస్థానం పలు మార్లు పిలిచిన టెండర్లలో అన్యమతస్తులు బినామీలుగా వ్యవహరిస్తూ పాల్గొంటున్నారన్నారు. వారిని గుర్తించి, ఇకపై రాకుండా కట్టడి చేయాలన్నారు.